# ఈ చట్టం వాళ్ళకు అర్థంకాని చిక్కుముడి

చట్టం ఎంతటి గొప్పదైనా అది సకాలంలో న్యాయంగా అందవలసిన వారికి అందకపోతే ఎన్నో అనర్థాలు జరుగుతాయి. తమకు జరిగిన అన్యాయాలపై ఎన్నో ఆశలు పెట్టుకొని వచ్చేవారికి న్యాయం సుదీర్ఘ విరామం తరువాత లభించినా నిరుపయోగం అవుతుంది.

దగాపడిన గిరిజన మహిళల విషయంలో అదే జరుగుతోంది. ప్రభుత్వమంటే ఏమిటో తెలియని గిరిజనులు కోర్టుల వరకు ప్రయాణించగలిగారు. ఓ మారుమూల కుగ్రామంలో రోజులు వెళ్ళదీసే గిరిజన మహిళలు తమ కేసులను తామే వాదించుకుంటున్నారు.

అయితే వారికి న్యాయశాస్త్ర పదకోశం అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారు. మాకు అన్యాయం జరిగింది న్యాయం చెప్పమంటే సంవత్సరాల తరబడి ఎందుకు తిప్పుతున్నారు. వెంటనే చెప్పవచ్చు కదా? అనే వారి అమాయక ప్రశ్నలకు జవాబు లేదు.

కోర్టులో న్యాయం కోసం ఆశ్రయించిన మహిళలుమొదటగా ఎదుర్కొనే ఇబ్బంది ఆర్థిక సమస్యలు. కోర్టుకు రావాలి అంటే ఒక రోజు కూలి పోతుంది. దారి ఖర్చులు కావాలి. అన్నిటికి మించి సున్నితమైన ఈ అంశంలో తనకు మద్దతుగా సాక్ష్యం సంపాదించక పోతే కేసువీగిపోతుంది. సాక్ష్యం తెచ్చుకోవడం అంటే ఆ వచ్చేవారికి కూలి పోతుంది.వారికి దారి ఖర్చులు పెట్టుకోవాలి. ఇంతా చేస్తే కోర్టులో ప్లీడర్ లేకపోతే ఎదుటి పక్షం ప్లీడర్ వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పడం చాలా కష్టం.

ఎంతో దూరం నుండి రంపచోడవరం వస్తే సాయంత్రం వరకు కోర్టులో వేచి వుండాలి. ఎదుటి పక్షం న్యాయవాది రాకపోయినా, ప్రతివాది రాకపోయినా కేసువాయిదా పడుతుంది. ఇలా నాలుగు సార్లు వాయిదా పడిన తరువాత విసుగు చెంది కొందరు కేసువదిలేస్తున్నారు.

ఇవి కోర్టులో కేసులు వేసిన గిరిజన మహిళలు ఎదుర్కొనే ఇబ్బందులు. కోర్టులో కేసులువేసి తమకు అనుకూలంగా తీర్పులు పొంది ఎటువంటి ప్రయోజనం లేకుండా వున్నవారు వున్నారు. క్రింద కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు పొంది, జిల్లా కోర్టులో ఓడిపోయి హైకోర్టులో పోరాడుతున్నవారు వున్నారు.

దాదాపు ఏడు సంవత్సరాలుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్న ఇర్లపల్లి గ్రామస్తురాలు వెంపా గంగమ్మ కోర్టుకు వచ్చిన ప్రతిసారి తన కళ్ళులేని కొడుకుని తీసుకురావాలి, సాక్ష్యం తెచ్చుకోవాలి. ఇంతా చేస్తే ఆ రోజు విచారణ జరుగుతుందో లేదో అన్న సందేహం.

నిరక్షరాస్యతవలన వెంపా గంగమ్మ తన పిటిషన్‌లో తాను వుంపెదు గత్తెను అని ఒప్పుకుంటూ వేలి ముద్ర వేసింది. ఉంపెదు గత్తెకు భరణం ఇవ్వవలసిన అవసరం లేదని కోర్టు భావించింది. దీనిపై వెంపా గంగమ్మ మళ్ళీ పిటిషన్ పెట్టుకున్నది. వాయిదా పడినప్పుడల్లా ఆమెకు ముచ్చెమటలు పోస్తాయి. కనీసం 100 రూపాయిలు లేకపోతే కోర్టుకు వెళ్ళలేదు. అదే ఇంకా దూర ప్రాంతాల వారి సంగతి చెప్పాల్సిన అవసరం లేదు.



ఏడు సంవత్సరాలుగా వెంపా గంగమ్మతో పాటు కోర్టులు చుట్టూ తిరుగుతున్న కొడుకు నాగేశ్వర రావు కేసు వదులుకొనేందుకు సిద్ధపడ్డాడు.

గంగమ్మకు మద్దతుగా సాక్ష్యం చెప్పేందుకు వచ్చిన బుగత రామన్న దొర అయితే సుదీర్ఘ విచారణలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "నేనుఇప్పటికి నాలుగుసార్లు కోర్టుకు వెళ్ళాను. నాలుగుసార్లూ నన్ను పిల్వలేదు. ఎన్నిసార్లు సాక్ష్యం చెప్పేందుకు నేను వెళ్ళాలి"

గంగమ్మ కేసులానే ఇంకా ఎన్నో కేసులు విచారణ జరుగుతున్నాయి.

చిన భీరంపల్లి గ్రామస్థురాలు బేలం బాపనమ్మ అటవీ శాఖ ఉద్యోగి మీద కేసువేసి భరణం రాబట్టింది. మూడు నెలలు ఇచ్చి మళ్ళీ ఇవ్వలేదని చెప్పింది. ప్రభుత్వోద్యోగులు జీతాల నుండి సబ్‌ట్రజరీ నుండి కట్ చేసి ఇచ్చేందుకు అవకాశం వున్నా అలా చెయ్యరు.

ప్రభుత్వోద్యోగులు మోసం చేసిన కేసుల్లో సైతం వెంటనే న్యాయం జరగడం లేదు.

తమకు న్యాయం చెయ్యమని వచ్చే గిరిజన మహిళలకు ముందు మధ్యంతర భరణం ఇప్పిస్తే ఎన్నో సమస్యలుపరిష్కారం అవుతాయి. అవసరమైనప్పుడు జన్యు కణాల పరీక్ష చేయిస్తే అత్యవసరంగా కేసులను పరిష్కరించవచ్చు. న్యాయం కోసం వచ్చే గిరిజన మహిళలు తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పకోవటంలో చైతన్యం పొందారు. కాని న్యాయం పొందడంలో ఎలా వాదించాలో వారికి ఇప్పటికి చిక్కుముడిగానే వుంది